జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 11-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 96 పేజీలు: 8 వెల: రూ.7





## దువ్వాడ ఇంట..

# రచ్చ రచ్చ

వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. ఓ వైపు భార్య, కుమార్తెలు.. మరోవైపు మరో మహిళ మాధురితోపాటు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనవాస్ మీడియా ముందుకొచ్చి తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. గత మూడు రోజులుగా దువ్వాడ శ్రీనివాస్ భార్య, కుమార్తెలు ఎమ్మెల్సీ కొత్త ఇంటి ముందే నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు శ్రీనివాస్, మరోవైపు వాణి పరుష పదజాలాలతో విమర్శలు, ప్రతివిమర్శలు చేసుకుంటున్నారు. మధ్యలో మూడో వ్యక్తి మాధురి సైతం తమ వాణిని వినిపిస్తోంది. ఇలా ఎవరికివారు ప్రెస్‌మీటర్లు పెట్టి తమ వాదనలు వినిపిస్తున్నారు.

శ్రీకాకుళం/టెక్కలి, ఆగస్టు 10 (వార్త):



## వాణి.. టార్చర్ చేసింది

- ✳ మా కుటుంబం వీధిన పడిపోయింది
- ✳ నా జీవితాన్ని వాణి.. నాశనం చేసింది
- ✳ కుమార్తెలను నాకు దూరం చేసేలే కుట్ర
- ✳ వాణికి రాజకీయ ఆకాంక్ష ఎక్కువ
- ✳ గత ఎన్నికల్లో నన్ను ఓడించేందుకే పనిచేసింది
- ✳ రాజకీయాల్లో సక్సెస్ అయ్యా..
- ✳ కుటుంబం వద్ద ఓడిపోయా
- ✳ వాణికి విడాకులు ఇచ్చేస్తా
- ✳ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలిలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. 25 ఏళ్లుగా రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉండి సక్సెస్ అయినప్పటికీ నా కుటుంబ వ్యవస్థ ముందు ఓడిపోయాన న్నారు. కుటుంబ వ్యవస్థలో భర్త నిర్ణయాలకు గౌరవించి.. అడుగుజాడల్లో నడిచే వారినే చూశానని, నా కుటుంబ పరిస్థితి అందుకు భిన్నంగా మారిందన్నారు. మా కుటుంబం వీధిన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకున్నానని, అధికారం ఉన్నా.. లేకున్నా.. ఒకే విధంగా పనిచేశానని తెలి పారు. నా కుటుంబానికి ఎలాంటి కష్టం కలగకుండా చూశా నని, నా సమస్యలను నా కుటుంబానికి ఎన్నడూ తాక నివ్వ లేదన్నారు. ఈరోజు నా కుటుంబం గురించి చెప్పుకోవాల్సిన పరిస్థితి నాకు ఏర్పడడం బాధాకరమన్నారు. నా కుటుంబమే నాపై దాడి చేస్తుందన్నారు. ఎన్నో కుటుంబాలు తన వద్దకు వస్తే వారి సమస్యలు తీర్చేవాడినని, నా కుటుంబ సమస్యను తీర్చుకోలేకపోతున్నారని వాపోయారు. నా భార్య వాణికి రాజకీయ ఆకాంక్ష ఎక్కువన్నారు. నన్ను రాజకీయాల్లో ఎదగనివ్వకుండా కుట్ర పన్నిందన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తనను ఓడించడానికి కృషి చేసిందన్నారు. నా వద్ద సాక్ష్యాలు కూడా ఉన్నాయని తెలిపారు. వాణి నా గురించి పిల్లలకు చెడుగా చెప్పిందని, నాపైనే తిరగబడేలా ప్రోత్సహించిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేను పుట్టుకతోనే శ్రీమంతుడిని కానని, నా దగ్గర డబ్బులు ఉన్న రోజులు ఉన్నాయి.. లేని రోజులూ ఉన్నాయన్నారు. అధిష్టానం దగ్గర కూడా టికెట్ కావాలని వాణి డిమాండ్ చేసిందని, నాతో విడాకులు ఇప్పించాలని అధిష్టానాన్ని వాణి కోరిందన్నారు. విడాకులు ఇప్పించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించిందని తెలిపారు. నన్ను ప్రతి సందర్భంలోనూ వాణి అవహేళన చేసిందని తెలిపారు. గ్రానైట్ వ్యాపారంలో వచ్చిన డబ్బు మొత్తం వాణికే ఇచ్చానన్నారు. కుటుంబ పరువు రోడ్డున పడకూదన్న ఉద్దేశంతో అధిష్టానంతో మాట్లాడి వాణికే టికెట్ ఇప్పించానన్నారు. మా అమ్మ, సోదరులకు నన్ను వాణి దూరం చేసిందన్నారు. మైన్‌ను తన పేరు మీద మార్చాలని వాణి ఒత్తిడి చేసి రాయించుకుందన్నారు. రెండేళ్ల నుంచి కుటుంబానికి దూరంగా ఉంటున్నానన్నారు. వాణినే నాకు దివ్వెల మాధురిని పరిచయం చేసిందన్నారు. ఇప్పుడు మాధురితో సంబంధం ఉందని ఆరోపణలు చేస్తోందన్నారు. దువ్వాడ వాణి.. మంత్రి అచ్చెన్నాయుడు డైరెక్షన్‌లో వెళుతున్నారన్నారు. అచ్చన్న వెనుక ఉండి నడిపిస్తున్నాడని నాకు తెలుసన్నారు. సభ్యసమాజంలోనూ, జగన్ ముందు ద్రోహిగా నిలబెట్టాలని చూస్తోందనిచ అందుకే వాణికి విడాకులు ఇస్తానని దువ్వాడ తెలిపారు.

## మరో మహిళ ట్రాప్‌లో పడ్డాడు:వాణి

రెండేళ్లుగా నా భర్త దువ్వాడ శ్రీనివాస్ చేస్తున్న పనుల మూలంగా కుటుంబమంతా రోడ్డున పడి ఇబ్బందులు పడుతున్నామని దువ్వాడ వాణి తెలిపారు. నాతో పాటు పిల్లలు కూడా బాధపడుతున్నారన్నారు. ఎంతో పేరున్న మా కుటుంబం పరువును రోడ్డుకు ఈడ్చేశాడన్నారు. మరో మహిళ ట్రాప్‌లో పడి లేనిపోని కబుర్లు చెబుతున్నాడన్నారు. ఆయన ఉండే నివాసం వద్దకు నేను పిల్లలతో కలిసి వెళ్తే మాపై రాడ్డుతో దాడిచేయడానికి వచ్చాడన్నారు. దువ్వాడ కుమార్తె హైందవి మాట్లాడుతూ.. తమ కుటుంబం విడిపోవడానికి కారణం దువ్వాడ సోదరుడు బాబా అని ఆరోపించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఎమ్మెల్యే బగ్గుకు సన్మానం



**పోలాకి, ఆగస్టు 10 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పాఠశాల యాజమాన్య కమిటీ బాటలు వేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. శనివారం పోలాకి మండలం మబుగాంలో గల తన క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నరసన్నపేట ఎస్ఎంసి సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాలనీ సమస్యలు పరిష్కరించండి

* ఎమ్మెల్యే కూన రవిని కోరిన వెంకటేశ్వర కాలనీవాసులు

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 10 (వార్త):** కొత్తరోడ్డులోని ఆర్మీ క్యాంటీన్ వెనుక ఉన్న వెంకటేశ్వర కాలనీ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం వెంకటేశ్వర కాలనీలో తమ్మినేని సురేష్, అన్నెపు జగన్‌ల నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మూల రాము, సనపల రుషి ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎమ్మెల్యేను కలిశారు. కాలనీలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వెంకటేశ్వర కాలనీవాసులు పంచాయతీకి ట్యాక్సులు కట్టినట్టయితే రోడ్లు, కాలువలు, తాగునీరు తదితర సదుపాయాలు సమకూరుతాయన్నారు. దీనికి కాలనీవాసులంతా ట్యాక్సులు కట్టేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో సనపల రాము, సాయిరాం, రవికుమార్ పాణిగ్రాహి, చింతాడ అప్పలనాయుడు, సనపల సుధాకరరావు, పైడి శారదారావు, అన్నాజీరావు, శ్రీను, బగాది ధనుంజయరావు, తాంద్ర వెంకటరావు, మోహనరావు మాస్టారు, లంకాపు వెంకటరమణ, కిల్లి ప్రసాద్, ఈశ్వరరావుతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.



## వర్మీ కంపోస్టుపై సర్పంచులకు అవగాహన



**జలుమూరు, ఆగస్టు 10 (వార్త):** వర్మీకంపోస్టుపై సర్పంచ్‌లకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా జలుమూరు మండల కేంద్రంలో చెత్తసంపద కేంద్రాన్ని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల వల్ల పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. వర్మీకంపోస్టుపై సర్పంచ్‌లు అవగాహన కలిగివుండాలన్నారు.

## ఖరీఫ్ పంటలకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



**సారవకోట, ఆగస్టు 10 (వార్త):** పంటలు సాగు చేస్తున్న రైతులు పంటల నమోదు తప్పనిసరిగా చేయాలని వ్యవసాయ శాఖాధికారి సీహెచ్ వెంకటరావు అన్నారు. సారవకోట మండలంలో కొనసాగుతున్న ఈ క్రాప్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదుకు సెప్టెంబర్ 15తో గడువు ముగుస్తుందన్నారు. ఈ క్రాఫ్ నమోదు చేసుకోవడం వల్ల రైతులకు అందవలసిన ప్రభుత్వ రాయితీలు, సబ్సిడీలను లబ్ధిదారులు సులభతరంగా పొందవచ్చని వివరించారు.

# ఉపాధ్యాయుల పక్షాన యూటీఎఫ్

* జిల్లా పూర్వ కార్యదర్శి పరమేశ్వరరావు
* హరిపురంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



**మందస, ఆగస్టు 10 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం మందస మండలంలోని హరిపురం గాంధీ జంక్షన్ వద్ద ఆవిర్భావ వేడుకలు మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత గాంధీజీ విగ్రహానికి సీనియర్ ఉపాధ్యాయులు బి.కుసరాజు, ఎం.బాలకృష్ణ, ఆర్.సోమేశ్వరరావు, వేణు గోపాల్, జగన్మోహనరావు, జెఎల్ చక్రధర్, రమణబాబు పూలమాలవేసి నివాళులు అర్పించారు. యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పూర్వ కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయుల పక్షాన పోరాడుతుందన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు మాట్లాడుతూ విద్యారంగాన్ని సమైక్యపరిచి అన్ని ప్రాంతాల, అన్ని మేనేజిమెంట్ల, అన్ని కేడర్ల సమైక్య సంఘంగా చారిత్రక అవసరంగా 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఏర్పడిందన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేసి, పాఠశాల పర్యవేక్షణ కక్ష సాధింపుగా కాకుండా పొరపాటులను సరి చేసుకునే విధంగా ఉండాలనీ, విద్యారంగానికి హాని చేసే 117 జీవో పూర్తిగా రద్దు చేయాలని యూటీఎఫ్ పనిచేసిందన్నారు. జిల్లా కార్యదర్శి గున్న రమేష్ మాట్లాడుతూ కేవలం యుటిఎఫ్ ద్వారానే రీగ్రూపింగ్ స్కేళ్లు, పే స్కేళ్లు పెంపుదలకు, ఎయిడెడ్ టీచర్ల డైరెక్ట్ పేమెంట్ నుంచి 60 సంవత్సరాలకు రిటైర్మెంట్ వరకూ, మున్సిపల్ టీచర్ల జీతాల అక్కౌంట్ నుండి 010 వరకు, ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టే కౌన్సెలింగ్ జిఓ సాధనతోపాటు అప్రెంటీస్ నోషనల్ ఇంక్రిమెంట్ల సాధనకు కృషి చేస్తామన్నారు. మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో అగ్రగామి సంఘంగా ఉంటూ ఐక్య ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ఫ్యాప్టోలో కోచైర్మన్, జెఏసిలో సెక్రటరీ జనరల్ బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల హక్కుల సాధనకు కృషి చేస్తున్న సంఘంగా యుటిఎఫ్ ఉందన్నారు. కార్యక్రమంలో మండల సహా అధ్యక్షులు ప్రియాంక మహా రాణా, గంట గోపాలకృష్ణ, జిల్లా అకాడమిక్ సెల్ కో కన్వీనర్ కంచరాన మాధవ రావు, జిల్లా కౌన్సిలర్లు జె సోమేశ్వరరావు, టి సోమేశ్వరరావు కే సోమేశ్వరరావు, జి రాజు, మండల కోశాధికారి సోమనాథ్ శిష్టు, ఎం రంగారావు, జి చంద్రశేఖర్ , మల్లేశ్వరరావు, టి రాంప్రసాద్, ఎస్ లోకనాథం, కే శ్రీనివాసరావు, ఎల్ జానకిరామ్, డి కిరణ్ కుమార్ , బాలార్జున పాత్రో , ఎ అప్పారావు, పి నరసింహామూర్తి, పి ఈశ్వరరావు, ఆర్ గోవిందరావు, అశోక్ కుమార్, పి భీమారావు, ఎం లోకనాథం, జి కృష్ణారావు, అందాల లోకేష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు తరగతి గదులు ప్రారంభం



**నరసన్నపేట, ఆగస్టు 10 (వార్త):** ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కొరత దృష్ట్యా, విరాళాలు సేకరించి రూ.2.26 లక్షలతో రెండు అదనపు తరగతి గదులను నిర్మించామని హెచ్ఎం హర్షవర్ధన్ శర్మ తెలిపారు. శనివారం ఈ భవనాలను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి ఒకరు రూ.40 వేలు ఇవ్వగా, మిగిలిన మొత్తాన్ని స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది నుంచి సేకరించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

**మందస, ఆగస్టు 10 (వార్త):** భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం గ్రామ సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం(బాలికలు)లో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి తెలిపారు. 5వ తరగతి ఎస్సీ కేటగిరిలో 46 సీట్లు, 6వ తరగతి ఎస్సీ కేటగిరిలో 47 సీట్లు, ఓసీ కేటగిరిలో ఒక సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. అదే విధంగా 7వ తరగతిలో ఎస్సీ కేటగిరిలో 39 సీట్లు, 8వ తరగతి ఎస్సీ కేటగిరిలో 40 సీట్లు, 9వ తరగతి ఎస్సీ కేటగిరిలో 45 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ ఎస్సీ కేటగిరిలో 21, ఓసీ కేటగిరిలో ఒకటి, బైపీసీ ఎస్సీ కేటగిరిలో ఒకటి, బీసీ కేటగిరిలో ఒక సీటు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సీట్లు కావాల్సిన విద్యార్థినిలు ఈ నెల 13న ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో గురుకులంలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ లక్ష్మి కోరారు.

# అంబేడ్కర్‌కు జైభీమ్ నివాళి

**జలుమూరు, ఆగస్టు10 (వార్త):** లింగాలవలస గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి జై భీమ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విజయవాడలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన విధ్వంసాన్ని నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జై భీమ్ కన్వీనర్ కింజరాపు సూరిబాబు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలలో వెలుగులు నింపిన అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం బాధాకరమన్నారు.



## రాష్ట్రంలో దాడులు హేయమైన చర్య

### మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**ఎల్ఎన్‌పేట, ఆగస్టు 10 (వార్త):** రాష్ట్రంలో కూటమి నేతల అరాచకాలు రోజురోజుకీ మితిమీరిపోతున్నాయని, అందుకు విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహంపై గురువారం రాత్రి టిడిపి నేతలు చేసిన దాడి ఉదాహరణగా కనబడుతోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఆమె శనివారం పాతపట్నంలోని క్యాంపు కార్యాలయంలో ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలగజేస్తూ.. ఎక్కడికక్కడే దాడులకు పాల్పడే ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం అతి తక్కువ కాలంలో పేరుపొందిందని అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును అగౌరవపరుస్తూ.. రాజ్యాంగ విరుద్ధమైన దాడులు చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ఇటువంటి అనైతిక దాడులు వెంటనే ఆపాలన్నారు.



ఇటువంటివి కొనసాగితే ప్రజలు ఎదురు తిరిగే రోజులు అతి దగ్గరలోని వస్తాయని, దాడులు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే పనిలో కూటమి నాయకులు ఉండాలన్నారు.

## చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

**నరసన్నపేట, ఆగస్టు 10 (వార్త):** నడగాం గ్రామానికి చెందిన కొల్ల సూర్యనారాయణ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సూర్యనారాయణ శనివారం మృతి చెందాడని ఏఎస్సై అసిరి నాయుడు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.

## కంబకాయలో ఉచిత వైద్య శిబిరం

**నరసన్నపేట, ఆగస్టు 10 (వార్త):** కంబకాయ సచివాలయ పరిధిలో వైద్య శిబిరాన్ని మాకివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పి.శిరీష శనివారం ఏర్పాటు చేశారు. 72 మందికి వైద్యులు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి తగు సూచనలు సలహాలు అందించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక







## కాంపిటేటివ్ పుస్తకాలు పంపిణీ

**నరసన్నపేట, ఆగస్టు 10 (వార్త):** కోమర్తిలోని కల్యాణ మండపంలో కొల్లి రాంబాబు సమకూర్చిన కాంపిటేటివ్ పుస్తకాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం పేద విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నరసన్నపేట నియోజకవర్గం జనసేన ఇంచార్జ్ బలగ ప్రవీణ్, మండల పార్టీ అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, శిమ్మ జగన్నాథం, కింజరాపు సూర్యనారాయణ, గొద్దు చిట్టిబాబు, రావాడ కృష్ణ పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి శివాజీ పరామర్శ


**మందస, ఆగస్టు 10 (వార్త):** మందస మండలంలో ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలను మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ పరామర్శించారు. సువర్ణపురం, చిన్నబహాడపల్లి, చిక్కిడిగాం, భావనాపురం గ్రామాలకు చెందిన దాసరి శ్రీరాములు, మాధవరావు, డొంకురు కిషోర్ కుమార్, సవర కామేశు ఇటీవల కాలంలో మృతి చెందారు. ఆ కుటుంబాలను శివాజీ పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ మీ కుటుంబాలకు అండగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య, తమిరి భాస్కరరావు, ముంజేటి చంద్రశేఖర్, సీర దుర్యోధన, రాజాన మహేష్, దుప్పల జగన్నాథరావు, సవర జగన్, సవర ధర్మారావు, గార కృష్ణారావు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుకులాన్ని సక్రమంగా నడపాలి



**మందస, ఆగస్టు 10 (వార్త):** మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం గ్రామం సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం(బాలికలు) విద్యాలయాన్ని సక్రమంగా నడపాలని దళిత ఐక్యవేదిక మందస ప్రతినిధులు కోరారు. గురుకులానికి వెళ్లిన వారు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మితో పలు అంశాలపై చర్చించారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు పిల్లలలో క్రమశిక్షణ రాహిత్యాన్ని తెలియజేస్తున్నాయని, వాటిని సరి చేయాలన్నారు. పిల్లలకు నాసిరకం భోజనాలు కాకుండా నాణ్యతతో కూడిన భోజనాలను, మెనూ ప్రకారం వడ్డించాలని కోరారు. పిల్లలని చూసేందుకు వస్తున్న తల్లిదండ్రులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక ప్రతినిధులు సిహెచ్ సత్యం, నగిరి కరుణాకర్, నగిరి నరసింహమూర్తి, నగిరి విజయబాబు, నగిరి మురళి, కొత్త పల్లి ప్రేమ్ చంద్, నగరి గౌతమ్ పాల్గొన్నారు.

## సమాజాన్ని తట్టిలేపేది సాహిత్యమే




**ఆమదాలవలస, ఆగస్టు10(వార్త):** సమాజాన్ని తట్టిలేపేది సాహిత్యమేనని రచయిత, విశ్వ సాహితి సంఘం అధ్యక్షుడు పొన్నాడ వరాహ నరసింహులు అన్నారు. స్థానిక సాహితీ నగర్‌లో విశ్వ సాహితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు, కళాకారులు తమ తమ రచనలు ద్వారా సమాజంలోని అంధ విశ్వాసాలను తరిమికొట్టే విధంగా నవచైతన్యానికి నాంది పలకాలన్నారు. సమాజంలో ఉన్న సమస్యలు పరిష్కారంలో తెలుగు పత్రికలు ఎనలేని పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. నాటి స్వాతంత్ర ఉద్యమంలో కూడా పత్రికలు ప్రధాన భూమిక పోషించాయని అన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు జి. కృష్ణారావు కర్నేని జనార్దన్‌రావు, ఎన్.చంద్రశేఖర్, టి.సీతారామాచార్యులు, వాసుదేవరావు పాల్గొన్నారు.

## నేడు వేణుగోపాలపురంలో వైద్య శిబిరం

**గార, ఆగస్టు 10 (వార్త):** వేణుగోపాలపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నామని ట్రస్ట్ చైర్మన్ కొంక్యాన మురళీధర్ తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారని, ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# నిరుపయోగంగా వాణిజ్య భవనాలు

* నేటికీ ప్రారంభం కాని వైనం
* మున్సిపాలిటీ ఆదాయానికి గండి
* పట్టించుకోని అధికారులు





**ఆమదాలవలస,ఆగస్టు10 (వార్త):** ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలోని మెట్టక్కివలసలో 1999లో నిర్మాణం పూర్తి అయిన వాణిజ్య భవన సముదాయ భవనాలు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. చిన్న, మధ్య తరగతి పట్టణాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వీటిని నిర్మించారు. ఇందులో మొత్తం 101 దుకాణాలను నిర్మించారు. ఇంతటి విలువైన భవన సముదాయం పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంతో ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మొత్తం ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో పాములకు, పందులకు నిలయంగా మారింది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. దీనికి బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తెచ్చి, పురపాలక ఆదాయానికి తోడ్పాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



**ఆమదాలవలస, ఆగస్టు 10(వార్త):** మత్తు పదార్థాలతో జీవితాలు సర్వ నాశనం అవుతుందని సీఐ దివాకర్ యాదవ్ విద్యార్థినులకు సూచించారు. శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం జరుగుతున్న ప్రమాదాలుపై అవగాహన కల్పించారు. బాలికలు బాగా చదువుకోవాలని, 18 ఏళ్లు నిండకుండా లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. ఎటువంటి మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదన్నారు. కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ కె.వెంకటేష్‌తో పాటు కేజీబీవీ ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



## కారిగూడ గురుకులంలో.. ఐటీడీఏ పీవో

**కొత్తూరు, ఆగస్టు 10(వార్త):** కారిగూడ గ్రామంలోని మినీ గురుకులాన్ని సీతంపేట ఐటీడీఏ పీవో శనివారం సందర్శించారు. స్కూల్‌లోని పిల్లలకు పెట్టిన భోజనం సరిగా ఉండడం లేదని, సరిపడ ఇవ్వడం లేదని, పిల్లలకు బాత్రూమ్‌లు అవసరమైన మేరకు లేవని, ఉపాధ్యాయులు సక్రమంగా బోధించడం లేదని ఐటీడీఏ పీవోకు టీడీపీ నేత లోతుగెడ్డ తులసి వర ప్రసాద్‌రావు తీసుకువెళ్లారు. అంతేగాకుండా విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేశారు. దీంతో ఐటీడీఏ పీవో గురుకులాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. పిల్లలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. రెండు రోజుల్లో కొత్త ప్రిన్సిపాల్ వచ్చేలా చూస్తానని, భోజనాలు మెనూ ప్రకారం అందేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో లోతుగెడ్డ తాతబాబు, కోయిలాపు సంజీవరావు, రేగేటి కన్నయ్య స్వామి, పడాల వెంకట కృష్ణ తదితరులు ఉన్నారు.

# నగరంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 11 (వార్త):** నగరంలో శనివారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని యువజన సర్వీసుల శాఖ, క్రీడా ప్రాధికారిక సంస్థ, పర్యాటక శాఖ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తంగా నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. ఈ ర్యాలీ 7 రోడ్ల జంక్షన్ నుండి కోడిరాంమూర్తి స్టేడియం వరకు సాగింది. ర్యాలీని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి యువత కు స్వాతంత్ర్యం విలువ తెలిపేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఓబులేష్, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, డీఎస్‌డీవో శ్రీధర్, పర్యాటకశాఖ అధికారి ఎన్.నారాయణరావు, నెహ్రూ యువ కేంద్ర అధికారి యన్ ఉజ్వల్, ఆర్ట్స్ సన్యాసిరావు , ఇతర జిల్లా అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## చీడివలసలో మెగా వైద్య శిబిరం



**బూర్జ, ఆగస్టు10(వార్త):** చీడివలస గ్రామంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల గ్రామస్థులు విష జ్వరాల పడిన నేపథ్యంలో స్థానిక నేత పిళ్ళా కన్నం నాయుడు ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని జెమ్స్ ఆసుపత్రి యాజమాన్యానికి కోరారు. దీంతో చీడివలసలో వైద్యులు అన్నెపు శ్రీధర్, ఉపేంద్ర, షర్మిల వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి రాజేశ్వరరావు, ఏరియా మేనేజర్ యల్ శ్రీధర్, పీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.





# పోలీసులు అంకితభావంతో పనిచేయాలి

* ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి
* కోర్టు మానిటరింగ్ పోలీసు సిబ్బందితో సమీక్షా

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 10 (వార్త):** జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి కోర్టు మానిటరింగ్ పోలీసు సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది, అధికారులు అంకితభావంతో ప్రజలకు సేవలు అందించాలన్నారు. స్టేషన్ల కోర్ట్ సిబ్బంది, కోర్ట్ లైజన్ సిబ్బందితో కేసుల ట్రయిల్ విధానం, వివిధ దశల్లో ఎదురవుతున్న సమస్యలు, సమన్స్, వారంట్స్ అమలు, సాక్ష్యలను కోర్టులో హాజరు పరచడం, కేసు అభియోగ పత్రాలు దాఖలు, ఇతరత్ర విధి విధానాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగివుండాలన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ సీఐ సోమ శేఖర్, ఎస్సై నేతాజీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**హిరమండలం, ఆగస్టు10 (వార్త):** అసాంఘిక చర్యలపై దృష్టి సారించి, నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. శనివారం హిరమండలం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది వసతి గృహాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తూ పెండింగ్ కేసులపై ఆరా తీశారు. నాటుసారా రవాణా, విక్రయాలు జరగకుండా నిఘా ఉంచాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని రకాలుగా చర్యలు తీసుకోవాలని, మైనర్ డ్రైవింగ్‌పై దృష్టిసారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నేర నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతతో పనిచేస్తే నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దవచ్చన్నారు. ఆయన వెంట ఎస్ఐ జి.నారాయణస్వామి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## కొత్తూరు పీఎస్ తనిఖీ

**కొత్తూరు,ఆగస్టు 10 (వార్త):** ఎస్పీ మహేశ్వర రెడ్డి కొత్తూరు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. పోలీసు స్టేషన్ ఆవరణతో పాటు రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం రవాణా జరగకుండా చూడాలని, దొంగతనాలు అరికట్టేందుకు నిఘా పెంచాలని సూచించారు.



# పారిశుధ్య కార్మికులు.. దైవ సమానులు

* వారి సేవలు నిరుపమానం
* అన్ని వేళలా అండగా ఉంటా
* కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్
* కార్మికులకు ఆరోగ్య పరీక్షలు




**శ్రీకాకుళం, ఆగస్టు 10 (వార్త):** పారిశుధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు నిరుపమానమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిరంలో ఈఎస్ఐ ఆసుపత్రి, జెమ్స్ హాస్పటల్ సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ తో కలిసి ప్రారంభించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మాత్రమే కాకుండా అన్ని వేళల్లో డాక్టర్లు, వైద్య సిబ్బందితో పాటు పారిశుధ్య కార్మికులు అందించని సేవలు ఎనలేనివన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు పాటుబడుతున్న పారిశుధ్య కార్మికులు దైవ సమానులని కొనియాడారు. వారికి అన్నివేళలా అండగా ఉంటామని చెప్పారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ నగర పరిశుభ్రతలోనూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలోనూ పారిశుధ్య కార్మికులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. నిత్యం అపారిశుధ్య వాతావరణంలో తిరుగుతూ బ్యాక్టీరియా, వైరస్ ల కారణంగా పారిశుధ్య కార్మికులు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా విలయతాండవం చేస్తున్న సమయంలో పారిశుధ్య కార్మికులు ప్రాణాలకు తెగించి సేవలు అందించారని చెప్పారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం పట్ల తనకు ఎంతో చిత్తశుద్ధి ఉందని వారికి ఏ అవసరం అయినా తాను చేసేందుకు ముందుంటానని తెలిపారు. ప్రభుత్వ పరంగా పారిశుధ్య కార్మికులకు అందాల్సిన సౌకర్యాలకు తాను బాధ్యత వహిస్తానని చెప్పారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై బాధ్యతకు ఈఎస్ఐ, జెమ్స్ ఆసుపత్రులు సంయుక్తంగా మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కమిషనర్ చల్లా ఓబులేషు, జిమ్స్ ఆస్పత్రి ఆర్ఎంవో ప్రవీణ్ కుమార్, అధికారులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## డీఎస్సీ శిక్షణా కేంద్రం ప్రారంభం




**పాతపట్నం, ఆగస్టు 10 (వార్త):** పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని జనసేన నేతలు చైతన్య, కొరికాన భవానీలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఈ శిక్షణ శిబిరం దోహదపడుతుందన్నారు. టెట్, డీఎస్సీకి ఇక్కడ శిక్షణ ఇస్తారన్నారు. డీఎస్సీలో మంచి మార్కులతో ఉద్యోగాలు పొందాలని సూచించారు. కొరికాన చారిటబుల్ ట్రస్టు ఈ శిక్షణ కేంద్రం నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొరికాన రవి, కుమార్, కోరాడ సర్వేశ్వరరావు, రామ్మోహన్, విశ్వక్ సేన్ ఇంఛార్జి దాసరి రాజు, బలగ ప్రవీణ్, వేగులాడ దుర్గారావు, కిరణ్, జి.రాజేశ్వరరావు, వి.విశ్వేశ్వరరావు, పిసిని చంద్రమోహన్ శిక్షణ కేంద్రాన్ని తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి



**హిరమండలం, ఆగస్టు10 (వార్త):** పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు బాధ్యతగా పనిచేస్తే ఆదర్శపంచాయతీలుగా తీర్చిదిద్దవచ్చని ఎంపీడీవో డిడి స్వరూపారాణి అన్నారు.శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో జరిగిన మూడు రోజుల శిక్షణ ముగిసింది.ఈ మేరకు ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీలు ఆదర్శంగా తయారు అవ్వాలంటే పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యుత్ దీపాలు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు.వీటికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా పనిచేస్తే గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉండవన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు.ప్రజలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా అందజేస్తున్న తాగునీరు పథకాలు,మురుగు కాలువలు,రహదారుల అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.ఈమెతో పాటు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఉన్నారు

## 12న జాతీయ అంతరిక్ష దినోత్సవం

**శ్రీకాకుళం, ఆగస్టు 10 (వార్త):** జాతీయ అంతరిక్ష దినోత్సవం 2024 వర్క్ షాప్, ఎగ్జిబిషన్‌ను శ్రీకాకుళం స్థానిక అంబేద్కర్ అడిటోరియంలో సోమవారం ఉదయం పది గంటలకు ప్రారంభమవుతుందని మత్స్య శాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్ అన్నారు. చంద్రయాన్ మిషన్-3 విజయానికి గుర్తుగా, విక్రమ్ ల్యాండర్ మృదువైన ల్యాండింగ్, ప్రగ్యాన్ రోవర్ విస్తరణ సందర్భంగా, భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 23ని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించిందన్నారు.

## లాభర పాఠశాల తనిఖీ

**పాతపట్నం, ఆగస్టు 10 (వార్త):** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ కుమార్ రెడ్డితో కలసి శుక్రవారం రాత్రి పాతపట్నం మండలం లాభర గ్రామంలో ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీసి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఏవిధంగా చదువుతున్నది దగ్గరుండి పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండి వారికున్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413